క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండ పాటించాలని, అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి సి.బెళగల్ మండల కాంప్లెక్స్ దగ్గర గూడూరు - ఎమ్మిగనూరు ప్రధాన రోడ్డుపై వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని 15 మంది వాహనదారులపై కేసు నమోదు చేసి రూ.6,500ల జరిమానా విధించారు.

ఉపాధి పనులపై గ్రామ సభ



మాట్లాడుతున్న డీఆర్‌పీ నాగరాజు

సి.బెళగల్: మండలంలోని కొత్తకోట గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై ఆదివారం డీఆర్‌పీ నాగరాజు గ్రామ సభను నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సర్పంచ్ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో పనుల తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31వ తేదీ మధ్యకాలంలో 61 పనులు చేపట్టగా, రూ1,29,48,998 ఖర్చు చేసినట్లు డీఆర్‌పీ తెలిపారు. పనుల కొలతలలో వ్యత్యాసం గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఈసీ పృధ్వీరాజ్, టీఏలు మురళీ, రాజశేఖర్, ఎఫ్ఏలు, కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుగాలిమెట్టలో కార్డన్ సర్చ్



నాటుసారా ఊటను ధ్వసం చేస్తున్న పోలీసులు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సర్చ్ నిర్వహించారు. సీఐ కిరణ్‌కుమారెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇళ్లను తనిఖీ చేశారు. అలాగే కొండల్లో నాటుసారా స్థావరాలపై దాడులు చేశారు. వెయ్యి లీటర్ల సారా ఊటన ధ్వంసం చేశారు. నాటుసారా తయారు చేసినా, విక్రయాలు చేపట్టినా కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యాక్రమంలో ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు. అధికారులు గైర్హాజరైతే ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తామని హెచ్చరించారు.

హిందువులు శంఖారావం పూరించాలి



మాట్లాడుతున్న శంఖారావం నాయకుడు

పాణ్యం: దేవాలయాలను కాపాడుకునేందుకు హిందువులు ఐకమత్యంగా శంఖారావం పూరించాల్సిన సమయం ఆసన్నమైందని నంద్యాల హైందవశంఖరావం కార్యదర్శి మేడ మురళీ పిలుపునిచ్చారు. మండల కేంద్రం పాణ్యంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన హిందూ బంధువుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయాల నిర్వహణ బాధ్యతలను పూర్తిగా హిందువులకే అప్పగించాలని దేశవ్యాప్తంగా ఉద్యమం ప్రారంభమైందన్నారు. ఈ మేరకు విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు రామభద్రప్ప, శంకరయ్య, ఛక్రధర్, నాగేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్ల ధర్నా

కర్నూలు(సెంట్రల్): వలంటీర్లను కొనసాగించి రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని కోరుతూ సోమవారం గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హుమాయూన్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నామని, భారీగా వలంటీర్లు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

భోగేశ్వరంలో భక్తుల సందడి

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీ దుర్గాభోగేశ్వరాలయంలో భక్తుల సందడి నెలకొంది. కార్తీకమాసం ముగింపు ఆదివారం అమవాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈశ్వరుడికి అభిషేకాలు చేశారు. ఉదయం ప్రారంభమైన భక్తుల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. కార్తీకమాసం, ఆలయ విశిష్టత గురించి ఆలయ ప్రధాన అర్చ కులు శ్యాంసుందర శర్మ భక్తులకు వివరించారు. భోగేశ్వరున్ని దర్శించుకున్న భక్తులు కాశీరెడ్డినాయన ఆశ్రమంలో ఉచిత అన్న ప్రసాదాలు స్వీకరించారు.

భోగేశ్వరుని సేవలో జడ్జి

దుర్గాభోగేశ్వరుడిని నంద్యాల ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి జెజవాడ రాధారాణి ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జడ్జికి ఈఓ రామానుజన్, అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, గిరినాథశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. జడ్జికి అర్చకులు అలంకార మండపంలో స్వామి, అమ్మ వారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.



ఏడూర్ల గవిలోని స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



భోగేశ్వరుడిని దర్శించుకునేందుకు వేచియున్న భక్తులు

ఏడూర్లగవికి పోటెత్తిన భక్తులు

మండల పరిధిలోని పైబోగుల గ్రామ సమీపాన ఏడూర్ల గవిలో వెలసిన గంగా ఉమాసమేత సర్వేశ్వరుడి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం చివరిరోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు గని ప్రతాప రెడ్డి రెడ్డి దంపతులు అన్నప్రసాదం అందించారు.

పాణ్యం: కార్తీక మాసం ఆదివారం అమావాస్యతో ముగిసింది. ఆలయాలు భక్తులతో కిటకిటాడాయి. స్వామి, అమ్మవారను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నెరవాడ గ్రామంలోని పుట్టాలమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఎదుట మహిళల కోలాటం ఆకట్టుకుంది. అదేవిధంగా కొండజుటూరు గంగమ్మ ఆలయంలో వనభోజనం కార్యక్రమాలు నిర్వహించారు.



నెరవాడ పుట్టాలమ్మ ఆలయం ఎదుట మహిళల కోలాటం



భోగేశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు



జడ్జి రాధారాణికి స్వామి ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న

భక్తులతో కిటకిటలాడిన బుగ్గరామేశ్వరం



బొడ్డువానిపల్లె ఆంజనేయస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న మహిళలు

ఓర్వకల్లు: మండల పరిధిలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామి ఆలయం కార్తీక మాసం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బుగ్గరామేశ్వర స్వామి, భ్రమరాంభికదేవికి ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె. లక్ష్మినారాయణ శర్మ, నరసింహశర్మ పంచామృత అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించి, భక్తులకు గోత్రనామాదులతో అర్చన చేశారు. అదేవిధంగా కొమ్ముచెరువు, బొడ్డువానిపల్లె, కాల్వ కోనేటి ఆంజనేయ స్వాముల దేవస్థానాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కొమ్ముచెరువు ఆంజనేయ స్వామి దర్శనార్థం బారులు తీరారు. అర్చకులు ఉదయం గణపతి పూజ, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, సింధూర లేపనంతో అలంకరించారు. సాయంత్రం ఆకుపూజ, మహామంగళహారుతులు, భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

కాల్వ కోనేటి ఆంజనేయస్వామిని దర్శించుకున్న కాటసాని

మండలంలోని కాల్వ గ్రామ సమీపంలో వెలసిన కోనేటి ఆంజనేయస్వామిని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొమ్ముచెరువు ఆంజనేయ స్వామిని దర్శించుకొని భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, కాల్వ సర్పంచు వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగతిరుపాలు, నూర్‌అహ్మద్, జికే వెంగన్న, హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఒకవైపు కార్తీక మాసం ముగింపు, మరో వైపు ఆదివారం అమవాస్య కావడంతో ఆంజనేయ స్వామి, బుగ్గరామేశ్వరస్వాముల వారిని దర్శించుకునేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు. మండలంలోని ప్రధానంగా కొమ్ముచెరువు, బొడ్డువానిపల్లె, కాల్వ కోనేటి ఆంజనేయ స్వాముల దేవస్థానాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆంజనేయం..ప్రసన్న ఆంజనేయం అంటూ భక్తుల గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. అలాగే కార్తీక మాసం ముగుస్తున్న నేపథ్యంలో ముందుగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వర స్వామిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కొమ్ముచెరువు ఆంజనేయ స్వామి దర్శనార్థం బారులు తీరారు. ఈ సందర్భంగా స్వాముల వారికి ఆలయ అర్చకులు ఉదయం గణపతి పూజ, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, సింధూర లేపనంతో అలంకరించారు. సాయంత్రం ఆకుపూజ, మహామంగళహారుతులు, భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్తీక మాసం ముగింపు రోజున కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వర స్వామి, భ్రమరాంభికదేవికి ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె. లక్ష్మినారాయణ శర్మ, నరసింహశర్మలు పంచామృత అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించి, భక్తులకు గోత్రనామాదులతో అర్చన చేశారు. భక్తులు అశేషంగా తరలిరావడంతో ఆలయ ఈఓ మద్దలేటి పర్యవేక్షణలో ఆలయ సిబ్బంధి ఎలాంటి అవాంతర పరిస్థితులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.



కొమ్ము చెరువులో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తున్న కాటసాని

● బొడ్డువానిపల్లెలో..

కార్తీక మాసం ముగింపు సందర్భంగా ఆదివారం బొడ్డువానిపల్లె ఆంజనేయస్వామిని సుమారు 20 వేల మంది భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో వున్న తులసికట్టకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. హోమం వద్ద కొబ్బరికాయలు సమర్పించి హోమాది పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, పుసులూరు ప్రభాకర్‌రెడ్డి ఆద్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

జీవనశైలి మార్పులతోనే డయాబెటీస్ నియంత్రణ



డాక్టర్ భవానీప్రసాద్‌ను సన్మానిస్తున్న డాక్టర్ పి.చంద్రశేఖర్ తదితరులు

కర్నూలు(హాస్పిటల్): జీవనశైలిలో మార్పులు చేసుకుంటే డయాబెటీస్ నియంత్రణలో ఉంటుందని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భవానీప్రసాద్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఏ క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో డయాబెటీస్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భవానీప్రసాద్ మాట్లాడుతూ.. ప్రస్తుతం డయాబెటీస్ వ్యాధిగ్రస్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. సమాజంలో 15 నుంచి 20 శాతం మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. జీవనశైలిలో మార్పులు, ఆహారంలో ఎక్కువగా తెల్లబియ్యం, మైదా, చక్కెర, ఉప్పు, కొవ్వు పదార్థాలు తీసుకోవడంతో పాటు మానసిక ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, స్థూలకాయం కారణంగా వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. గతంతో పోలిస్తే షుగర్ వ్యాధి నియంత్రణకు ప్రస్తుతం అనేక ఆధునిక మందులు అందుబాటులోకి వచ్చాయన్నారు. అయినా జీవనశైలిలో మార్పులు చేసుకోకపోతే వ్యాధి నియంత్రణలోకి రాదన్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం, నడక, మితాహారం తీసుకోవడం, ఆహారంలో స్వీట్లు, తెల్ల అన్నం, కొవ్వు పదార్థాలు తగ్గించాలని, ప్రశాంతతకు యోగా, ధ్యానం చేయడం చేయాలన్నారు. అనంతరం ఆయన్ను హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, సభ్యులు సన్మానించారు.

మందుబాబులపై డ్రోన్ నిఘా

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో 18 ఓపెన్ లిక్కర్ డ్రింకింగ్ కేసులు నమోదయ్యాయి. నగరంలో పోలీసులు డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచారు. డీఎస్పీ జె.బాబుప్రసాద్ ఆధ్వర్యంలో నేర నియంత్రణ చర్యల్లో భాగంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నాలుగవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా, డీ మార్టు వెనుకవైపు ఉన్న సమస్యాత్మక ప్రదేశాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరా ద్వారా నిఘా చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 18 మందిని ట్రాఫిక్ పోలీసులు, నాలుగవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. ఇకపై నిరంతరం నిఘా ఉంటుందని పోలీసులు వెల్లడించారు. కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, కర్నూలు నాలుగవ పట్టణ ఎస్‌ఐ గోపీనాథ్, ట్రాఫిక్ ఏఎస్‌ఐ హుస్సేన్ పాల్గొన్నారు.

భయపెడుతున్న తుపాన్



లారీలో వడ్ల బస్తాలు నింపుతన్న వ్యవసాయ కూలీలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వరిధాన్యం

● వరి రైతులకు తీవ్ర నష్టం
● పచ్చి దిగుబడులనే అమ్మేస్తున్న ఖైనం

పాణ్యం: ఫెంగల్ తుపాన్ రైతులను భయపెడుతోంది. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో తుపాన్ హెచ్చరికలతో రైతులు మగ్గిపోతున్నారు. పంటను మడిలోనే పెడితే తడిసిపోతుందని కోతలు చేపడుతున్నారు. కోతలు పూర్తి చేసిన రైతులు సైతం ధాన్యాన్ని నిల్వ చేసుకోలేక వెంటనే అమ్మేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. పాణ్యం మండలంలో వరి ఎక్కువగా సాగు చేస్తారు. ఎస్సార్‌బీసీ కాలువ ఉండడంతో కందికాయపల్లె, పిన్నాపురం, తమ్మరాజు మినహా ప్రతి గ్రామంలో వరి సాగు అవుతుంది. ఈ ఖరీఫ్‌లో మండలంలో దాదాపు 2,500 హెక్టార్లలో వరి సాగు అయ్యింది. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇంతలో ఫెంగల్ తుపాన్ హెచ్చకలతో రైతులు అయోమయానికి గురుతున్నారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసిన రైతులు కల్లాలో ధాన్యాన్ని నిలువ చేసుకున్నారు. తపాన్ మూలంగా వర్షాలు కురిస్తే ధాన్యాన్ని కాపడుకోలేమనే ఆందోళన చెందుతున్నారు. దీంతో పచ్చిధాన్యాన్ని అమ్మేస్తున్నారు. కోతలు ప్రారంభించని రైతులు పరిస్థితి అంతే. మడిలో ఉంచుకోలేని పరిస్థితి. దీంతో కోతలు మొదలుపెడుతున్నారు. ముందస్తుగా వ్యాపారులతో ఒప్పందం చేసుకుని కోతలు కోస్తున్నారు. వ్యాపారులు నిర్ణయించిన ధరకు పచ్చి ధాన్యాన్ని విక్రయిస్తూ నష్టాలు చవిచూస్తున్నారు వరి రైతులు.

వ్యాపారులు చెప్పిందే ధర...

ఫెంగల్ తుపాన్ హెచ్చరికలు వ్యాపారులకు మాత్రం బాగా కలిసొచ్చింది. తుపాన్ మూలంగా వరి దిగుబడుల నిల్వ చేసుకోవడం కష్టంగా మారిన నేపథ్యంలో వ్యాపారులు చేతివాటం చూపుతున్నారు. వారు చెప్పిందే ధర అన్నట్లుగా ఉంది పరిస్థితి. బస్తా కేవలం రూ. 1,500 చొప్పున రేటు ఫిక్స్ చేశారు. గత్యంతరంలేక రైతులు అమేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే బస్తాపై రూ. 300 చొప్పు నష్టపోతున్నారు వరి రైతులు. గత ఖరీఫ్, రబీ సీజన్‌లో వరి బస్తా రూ. 1,800 చొప్పును అమ్ముకున్నారు. ఇప్పుడా పరిస్థితి లేదు. తపాన్ భయంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుకను తోడేస్తున్నారు!





తుంగభద్ర నది నుంచి ఇసుకను తీసుకెళ్తున్న దృశ్యాలు

● ఉచితం పేరుతో అక్రమ వ్యాపారం
● తుంగభద్ర నది నుంచి ఇష్టారాజ్యంగా తరలిస్తున్న అక్రమార్కులు
● కన్నెత్తి చూడని అధికారులు

కర్నూలు(రూరల్): తుంగభద్ర నది ఇసుక అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. జిల్లా కేంద్రం కర్నూలు సమీపానున్న ఈ నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా అడిగేదిక్కు లేరు. రాత్రి, పగలు తేడాలేకుండా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి మండల పరిధిలోని మునగాలపాడు, మామిదాలపాడు, నిడ్జూరు, జి.సింగావరం, పంచాలింగాల, ఈ.తాంంద్రపాడు, గొందిపర్ల, దేవమాడ, పూడురు గ్రామాల సరిహద్దున తుంగాభద్ర నది నుంచి ఇసుకను యథేచ్ఛగా తరిస్తున్నారు. ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లతో ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు అక్రమార్కులు. వంతెనల సమీపాన ఇసుక తరలింపు నిషేధమైనా ఎవరికీ పట్టడడం లేదు. ... చర్లతోపాటు గృహ నిర్మాణలకు ఇసుక సరఫరా చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ట్రాక్టర్ ఇసుకు రూ. 3 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. వంతెనల సామీపాన ఇసుక తరలింపు నిషేధమైనా ఎవరికీ పట్టడడం లేదు. మునగాలపాడు గ్రామ వంతెన సమీపాన ఇష్టారాజ్యంగా ఇసుకను తవ్వుతున్నా అడిగే నాథుడు కరువయ్యారు.

అధికారపార్టీ నేతల అండదండలతో....

ఉచిత ఇసుక విధానం ఓ విధంగా అధికారపార్టీ నేతలకు కలిసొచ్చింది. అనుచరులకు ఆదాయ వనరుగా మారింది. వాస్తవానికి ఉచిత ఇసుక తీసుకెళ్లేందుకు ప్రభుత్వం నియమనిబంధనలు విధించింది. సొంత నిర్మాణాలకే ఇసుకను ఉచితంగా తీసుకెళ్లాల్సి ఉంది. అదికూడా గ్రామ సచివాలయల్లో పంచాయతీ సెక్రటరీ అనుమతి తప్పనిసరి. కూటమి నేతల అండదండలతో అనుచరులు ఇష్టారాజ్యంగా తుంగభద్ర నది ఇసుకను తోడేస్తున్నారు. ఇంకొందరు అక్రమార్కులు అధికారపార్టీ నేతల అండదండలతో ఏకంగా ఇసుక డంప్‌లు ఏర్పాటు చేశారనే విమర్శలు లేకపోలేదు. గత నెలలో ఓ గ్రామంలో ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు గుర్తించిన తీరు ఇందుకు సాక్షంగా నిలుస్తుంది. అధికారులు ఇప్పటకైనా స్పందించి అక్రమ ఇసుక రవాణాలను అరికట్టాలన ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఉచిత ఇసుకకు అనుమతి తప్పనిసరి



గృహ నిర్మాణాలకు సంబంధించి ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు పంచాయతీ సెక్రటరీ అనుమతి తప్పనిసరి. సెక్రటరీ అంగీకార ధ్రువ పత్రం ఉంటేనే ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతి. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ, పాలీస్, మైనింగ్ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తెలిసిస్తే ఎంతటివారైనా ఉపేక్షించం. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– టీవీ రమేష్ బాబు, తహసీల్దార్

బాబూ షూరిటీ... బాదుడుకు గ్యారంటీ

కోడుమూరు రూరల్: సీఎం చంద్రబాబు షూరిటీ.. సూపర్ సిక్స్ పథకాల అమలుకు గ్యారంటీ కాదని, ట్రూఅప్ చార్జీల పేరుతో వీర బాదుడుకు అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు ఎద్దేవా చేశారు. ఆదివారం కోడుమూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచబోమని ఇచ్చిన హామీని విస్మరించిందన్నారు. అధికారంలోకొచ్చి 6నెలలు గడవకముందే కూటమి ప్రభుత్వం నెలలోనే రెండు సార్లు ట్రూఅప్ చార్జీల భారం ప్రజలపై మోపడమేమిటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువల ధరలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి పేదలపై మోయలేని భారం మోపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెంచిన చార్జీలను తగ్గించాలని, లేని పక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రవికుమార్‌రెడ్డి, రాజారమేష్, వీరన్న, మాసుమ్, ప్రసాద్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు

ఉపాధి కల్పించే వరకు పోరాటం

కర్నూలు(సెంట్రల్): పట్టణ ప్రాంతాల్లో పరిశ్రమలు - ఉపాధి కోసం ఉద్యమిద్దామని సీపీఎం న్యూసిటీ నగర కమిటీ నిర్ణయించింది. ఆదివారం కేకే భవన్ సమీపంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో సీపీఎం కర్నూలు న్యూసిటీ నగర కమిటీ మూడో మహాసభలను ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి ప్రారంభించారు. ముందుగా మహాసభ ప్రారంభ సూచికగా సీపీఎం పతాకాన్ని న్యూసిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ సాయి బాబా ఎగురవేశారు. అనంతరం నాయకులు ఆర్. నరసింహులు, కె.అరుణమ్మ, శంకర్‌ల అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి, పి.నిర్మల, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ.. రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు నగరంలో యువతకు ఉపాధి కరువైందన్నారు. ఉపాధి కోసం బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడే పరిశ్రమలు ఏర్పాటు చేసే యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న టీజీ భరత్ పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలని కోరారు. కర్నూలు నగరం వేగంగా విస్తరిస్తున్నా శివారు కాలనీల్లో కనీస మౌలిక సదుపాయలు లేవన్నారు. ముఖ్యంగా కాలువలు, రోడ్లు, మంచినీటి సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. న్యూసిటీ కమిటీ నగర కార్యదర్శి టి.రాముడు, రామాంజనేయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి